సాక్షి
మెదక్
గురువారం । 23 । మార్చి । 2023



డ్రైవరే సూత్రధారి 8లో
దారిదోపిడీ కేసును పోలీసులు సవాలుగా తీసుకుని రెండు రోజుల్లో ఛేదించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు.



మాటకలిపి దోచేస్తున్నారు
పార్ట్‌టైమ్ జాబ్ ఉందంటూ అపరిచితుడు మాటకలిపి వ్యక్తి ఖాతా నుంచి పెద్దమొత్తంలో సొమ్ము కాజేశాడు. 8లో



గ్రామదేవతల ఉత్సవాలు
ఉగాది సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు గ్రామ దేవతల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. 9లో

న్యూస్‌రీల్

ఏడుపాయల పూజారికి ఉగాది పురస్కారం



మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పార్థివ శర్మ

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల పూజారి పార్థివ శర్మకు రాష్ట్ర ఉగాది పురస్కారం లభించింది. బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వేడుకల్లో ఈ పురస్కారాన్ని దేవదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఆయన పుట్టిన రోజు నాడే పురస్కారం అందుకోవడం విశేషం. పార్థివ శర్మది పాపన్నపేట మండలం కొడుపాక స్వగ్రామం. ఉగాది పురస్కారం అందుకున్నందుకు ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్, ఈఓ సార శ్రీనివాస్, పాలక మండలి సభ్యులు ఆయనను అభినందించారు.

నేత్రపర్వంగా మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం



మల్లికార్జున స్వామిని దర్శించుకుంటున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడలోని ఉగాది వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో బుధవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం, బండ్లు తిరుగుట, అగ్నిగుండాల కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని మల్లన్న స్వామిని కోరుకున్నట్లు తెలిపారు. అంతకముందు నిజాంపేటలోని శ్రీ రేణుక ఎల్లమ్మను దర్శించికున్నారు. పూజా కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మల్లేశం, యాదవ సంఘం సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణ పోస్టర్ ఆవిష్కరణ



హనుమాన్ చాలీసా పారాయణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన రామాయంపేటలో సహస్ర హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం మండలంలోని జంగరాయి గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 108 జంటలతో యజ్ఞం నిర్వహించిన అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకుడు బాగారెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ ప్రభాకర్, చంద్రారెడ్డి, వడ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంబాద్‌లో ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్



బహుమతులు అందిస్తున్న దృశ్యం

నర్సాపూర్ రూరల్: మండలంలోని ఇబ్రహీంబాద్‌లో ఉగాది పండుగను పురస్కరించుకొని నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు ఇబ్రహీంబాద్ సర్పంచ్ యశోద సత్యనారాయణ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొండల్‌రెడ్డి, యువ నాయకుడు రాజేందర్ నాయక్ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి వినయ్, సుభాష్, రాకేష్, ముజీమ్, నాగరాజు, ద్వితీయ బహుమతి చంద్రప్రకాష్, సత్యనారాయణ, సూర్యప్రకాష్, విజయ్, మహేశ్, బన్నీకి అందజేశారు.

శ్రీశోభకృత్ పంచాంగ శ్రవణం



తూప్రాన్‌లో పంచాంగ శ్రవణం చేస్తున్న సోమయాజుల రవీంద్రశర్మ



మెదక్‌జోన్: వెంకటేశ్వరాలయంలో పంచాంగ పఠనం చేస్తున్న పూజారి వైద్య శ్రీనివాస్



శివ్వంపేట(నర్సాపూర్): కొంతన్‌పల్లిలో పంచాంగ విశేషాలు వింటున్న ప్రజలు

శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉగాది సందర్భంగా బుధవారం తెల్లవారు జామునే ఇంటి గుమ్మాలను తోరణాలతో అలంకరించారు. తలంటు స్నానాలు చేసి చిన్నా పెద్ద సంప్రదాయ దుస్తులు ధరించి తమ ఇష్ట దైవాలకు పూజలు చేశారు. ఉగాది పచ్చడిని స్వీకరించారు. అనంతరం దేవాలయాలకు వెళ్లి పంచాంగ శ్రవణ విశేషాలు శ్రద్ధగా విన్నారు. ఈ సంవత్సరంలో జరగబోయే విశేషాలు, తమ నామ నక్షత, రాశి ఫలాలు తెలుసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపారు.

బెల్ట్ తీస్తున్న ప్రజలు

- మద్యం అమ్మకాలపై మహిళల తిరుగుబాటు
- అనర్థాలను గుర్తిస్తున్న గ్రామీణ జనం
- సంపూర్ణ మద్యనిషేధానికి పంచాయతీల తీర్మానాలు



చిన్నశంకరంపేట మండలం శేరిపల్లిలో మద్యం విక్రయించొద్దంటూ ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

మెదక్‌జోన్: మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం శేరిపల్లి గ్రామ జనాభా 2,500. ఆ గ్రామంలో ఐదు బెల్టుషాపులున్నాయి. అక్కడ 24 గంటలు మద్యం అందుబాటులో ఉండేది. చాలామంది మద్యానికి బానిసలయ్యారు. ఇటీవల ఓవ్యక్తి మద్యం తాగి చనిపోయాడు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఈనెల 6వ తేదీన గ్రామ సర్పంచ్ సహకారంతో గ్రామంలో బెల్టు షాపులను తొలగించాలని, మద్యం అమ్మినా, తాగినా జరిమానా విధించాలని తీర్మానం చేశారు. తీర్మానం తర్వాత ప్రస్తుతం ఆ పల్లె ప్రశాంతంగా ఉంది.

నిజాంపేట మండలం కల్వకుంట గ్రామంలో మూడు వేల జనాభా ఉంది. ఆ ఊరిలో పది బెల్టుషాపుల ద్వారా మద్యం అమ్మేవారు. నెల క్రితం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన బిల్డింగ్‌పైన మద్యం తాగాడు. కిందకు దిగే క్రమంలో కిందపడి చనిపోయాడు. ఆగ్రహించిన మహిళలు గ్రామంలోని బెల్టు షాపులపై దాడులు చేసి మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. ఈ గ్రామంలోనూ మద్యం అమ్మినా, తాగినా జరిమానా తప్పదంటూ తీర్మానం చేశారు.

- ఇదే మండలం చల్మెడలోనూ గల్లీకో బెల్ట్‌షాపు ఉండేది. ఇక్కడ కూడా మద్యం అమ్మినా, తాగినా జరిమానా తప్పదంటూ తీర్మానించారు.
- మెదక్ జిల్లాలో 21 మండలాల పరిధిలో 469 గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో 49 వైన్స్‌లు, రెండు బార్లు కొనసాగుతున్నాయి.
- బెల్ట్‌షాపులు మాత్రం వెయ్యికిపైగా ఉన్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే తాగునీరు దొరక్కపోవచ్చు కానీ, మద్యం మాత్రం అన్ని సమయాల్లో దొరుకుతుంది.
- ఫలితంగా ఉదయం లేచింది మొదలు అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలు జోరుగా సాగుతాయి. తాగుడుకు బానిసలైన వారు అర్ధంతరంగా చనిపోవటం, ప్రశాంత పల్లెల్లో దొంగతనాలు, గొడవలు, పోలీసు కేసులు, హత్యలు నిత్యకృత్యమయ్యాయి.
- మద్యం అమ్మకాల టార్గెట్లు పూర్తిచేయాలనే ఆదేశాలు ఉండటంతో సంబంధి శాఖ పరోక్షంగా బెల్టుషాపులను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.
- మద్యానికి బానిసైన ఎంతో మంది అనారోగాల బారిన పడి చనిపోతున్నారు.
- ఈ తీవ్రతను గుర్తించిన జనం పల్లెలోని బెల్టుషాపులను తొలగిస్తున్నారు. ఊరంతా ఏకతాటిపైకి వచ్చి మద్యం అమ్మకాలకు అడ్డుకట్ట వేస్తున్నారు.
- ప్రజల డిమాండ్‌లకు తలొగ్గి గ్రామ పంచాయతీ పాలకవర్గాలు సంపూర్ణ మద్యనిషేధ తీర్మానాలు చేస్తున్నాయి.

గతమంతా ప్రశాంతం

- గ్రామాల్లో ప్రశాంతమైన వాతావరణం ఉండేది. రైతులు, కూలీలు, వివిధ పనులు చేసుకునే వారు ఉదయం ఎవరి పనులకు వాళ్లు వెళ్లేవారు.
- మందు తాగే అలవాటున్న వారు పని పూర్తయ్యాక సాయంత్రం మండల కేంద్రాల్లో గల వైన్‌షాపుల నుంచి మందు తెచ్చుకునే వారు. అదికూడా చాలా పరిమితం. చాలా మంది కల్లు మాత్రమే తాగేవారు.
- కానీ ఇపుడు పరిస్థితి గతంకంటే భిన్నంగా ఉంది. ప్రభుత్వం వైన్‌షాప్‌లకు టార్గెట్ విధించడంతో వాటి యజమానులు టార్గెట్ కోసం గ్రామాల్లో బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తున్నారు.
- దీంతో రెండు, మూడు నుంచి మొదలుకుని మేజర్ పంచాయతీల్లో డజన్‌కు పైగానే బెల్ట్‌షాపులు వెలిశాయి.
- మందు కోసం దూరంగా వెళ్లాల్సిన పనిలేకుండా రేయింబవళ్లు అందుబాటులో లభిస్తోంది.
- గల్లీకో బెల్ట్‌షాపు వెలియడంతోపాటు, సిట్టింగ్ కూడా ఏర్పాటు చేస్తుండటంతో గ్రామాల్లో వాతావరణం పూర్తిగా మారిపోయింది.
- బెల్ట్ షాపుల కారణంగా కష్టపడి సంపాదించిందంతా తాగుడుకు వెచ్చిస్తున్నారు. తాగిన మైకంలో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.
- కొందరు మద్యం మత్తులో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మరికొందరు రోడ్లమీద గొడవ చేస్తున్నారు. ఇలాంటి సంఘటనల కారణంగా గ్రామీణ యువకులు, యూత్ అసోసియేషన్లు బెల్ట్ షాపులకు వ్యతిరేకంగా పోరాటాలు మొదలు పెట్టారు.

మద్యం బంద్ చేసిన పల్లెలు

- రామాయంపేట మండలం కె.వెంకటాపూర్‌లో 2009 నుంచి సంపూర్ణ మద్యపాన నిషేధం అమలవుతోంది. గ్రామంలో మందు అమ్మినవారికి రూ.25 వేల జరిమానా, పట్టుకున్న వారికి రూ.5 వేల బహుమతి ఇస్తామని తీర్మానం చేయడంతో మద్యం అమ్మకాలకు ఫుల్‌స్టాప్ పడింది.
- ఇదే మండలం ప్రగతి ధర్మారం గ్రామంలో మద్యం అమ్మినా, తాగినా జరిమానా తప్పదంటూ గ్రామ పంచాయతీ ద్వారా ఏకగ్రీవ తీర్మానం చేయటంతో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలవుతోంది.
- చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామంలో 2016 నుంచి బెల్టుషాపుల నిర్వాహణ మాన్పించారు. ఇలా ఒక్కో గ్రామ ప్రజలు చైతన్యవంతులై మద్యానికి వ్యతిరేకంగా తీర్మానాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



రథోత్సవంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

వైభవంగా బర్మాస్వామి ఉత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి పిల్లుట్లలో బర్మాస్వామి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఏటా ఉగాది నాడు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. బుధవారం బర్మాస్వామికి పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలు సమర్పించారు. రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, పీఏసీఎస్ వెంకట్‌రామిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, సర్పంచ్ పెద్దపులి రవి, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న సునీతారెడ్డి

శ్రీశోభకృత్ నామ ఉగాది వేడుకలు

మెదక్‌జోన్: శ్రీ శోభకృత్ నామ ఉగాది సంవత్సరం వ్యవసాయానికి అనుకూలమైన ఏడాదని పూజారి వైద్య శ్రీనివాస్ వెల్లడించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని వెంకటేశ్వర ఆలయంలో పంచాంగం చదివి వినిపించారు. గతేడాదితో పోల్చితే ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిసి ఆశించన విధంగా పంటలు పండుతాయన్నారు. రాజకీయాల్లో అనేక మార్పులు చోటు చేసుకుంటాయని చెప్పారు.

వైద్యరంగంలో మెదక్ అభివృద్ధి

మెదక్ పేరు మీద మఖ నక్షత్రం ఉన్నందున సింహరాశి ఏప్రిల్ 21 తర్వాత గురువు మంచి స్థానంలోకి వస్తాడని ఫలితంగా వైద్యరంగంలో మెదక్ మంచి పురోగతి సాధిస్తుందని చెప్పారు. అలాగే పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందన్నారు. రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. జిల్లా యువత చైతన్యవంతులవుతారని, జాతీయ క్రీడలకు మెదక్ వేదికయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. గ్రామీణాభివృద్ధిలో మంచి స్థానం లభిస్తుందని, ఈ ప్రాంతలో దేవాలయాల అభివృద్ధి, జాతీయ రహదారుల అనుసంధానం, అడవుల అభివృద్ధి గణనీయంగా వృద్ధి చెందుతాయని వెల్లడించారు. పండ్లతోటలు, పూలు, కూరగాయలు అధికంగా పండిస్తారని చెప్పారు. ఆధ్యాత్మిక ప్రార్థన విషయాల్లో కలహాలు చోటు చేసుకునే అవశాలు ఉన్నాయని వివరించారు.

శివ్వంపేట(నర్సాపూర్): ఉగాది వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం ఉదయం తమ ఇష్ట దైవాలకు పూజలు చేశారు. ఉగాది పచ్చడి స్వీకరించి, పంచాంగ శ్రవణం కోసం దేవాలయాలకు వెళ్లారు. పురోహితులు శ్రీశోభకృత్ నామ సంవత్సరంలో జరగబోయే విశేషాలను వివరించారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి గోమారంలోని ఆమె నివాసంలో కుటుంబ సభ్యులతో ఉగాది వేడుకలు జరుపుకున్నారు.

తూప్రాన్: శ్రీ శోభకృత్ నామ ఉగాది వేడుకలను ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో సోమయాజుల రవీంద్రశర్మ శ్రీశోభకృత్ నామ సంవత్సర పంచాంగ విశేషాలు తెలియజేశారు. ఈ నూతన సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురియడంతో రైతులు, ప్రజలు సుఖసంతోషలతో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్ గౌడ్, కౌన్సిలర్లు శ్రీశైలంగౌడ్, మామిండ్ల జ్యోతి కృష్ణ, పురోహితులు శలాక కృష్ణమూర్తి శర్మ, శలాక రాజేశ్వరశర్మ, శలాక ఆత్రేయ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

మరో ఐదుగురికి ఫుడ్ పాయిజన్



నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దౌల్తాబాద్‌కు చెందిన యువకులు

నర్సాపూర్: మండీ బిర్యానీ తిన్న మరో ఐదుగురికి ఫుడ్ పాయిజన్ అయ్యింది. వివరాలిలా ఉన్నాయి. నర్సాపూర్‌లోని ఓ మండి హోటల్‌లో శనివారం బిర్యాని తిని అస్వస్థతకు గురైన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. నర్సాపూర్, సీతారాంపూర్ తదితర గ్రామాలకు చెందిన పలువురు యువకులు ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారు. ఆరోగ్యం కుదుటపడటంతో కొందరు బుధవారం డిశ్చార్జి అయ్యారని తెలిసింది. కాగా సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్‌కు చెందిన ఓ కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు ధనుష్ కుమార్, సాయికిరణ్, పవన్ తమ సమీప బంధువులు మధుకర్, సందీప్‌ల కలిసి నర్సాపూర్‌లోని ఓ మండీ హోటల్‌లో శనివారం రాత్రి బిర్యానీ తిన్నారు. వారికి కూడా ఆదివారం మధ్యాహ్నం నుంచి వాంతులు, విరేచనాలు కావడంతోపాటు కడుపునొప్పిరావడంతో చికిత్స కోసం దౌల్తాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేరారు. కడుపు నొప్పి తగ్గకపోవడంతో బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైనవారికి చికిత్స అందిస్తున్నామని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

బగలాముఖి శక్తిపీఠం అభివృద్ధికి కృషి



అమ్మవారిని దర్శించుకుంటున్న నీలం మధు, తదితరులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖి అమ్మవారి శక్తిపీఠం అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని చిట్కుల్ సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకులు నీలం మధు అన్నారు. ఉగాది పండుగ సందర్భంగా బుధవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బగలాముఖీ ఉపసాకుడు, వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ లేని విధంగా ఆలయ నిర్మాణం చేపట్టడం సంతోషకార విషయమన్నారు. రానున్న కాలంలో శివ్వంపేట ఆధ్యాత్మిక కేంద్రానికి నిలయంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, పెద్ద ఎత్తున యువకులు పాల్గొన్నారు.

పగిలిన భగీరథ పైపు

- వృథాగా పోతున్న నీరు
- కలుషిత నీటి సరఫరా
- పట్టించుకోని అధికారులు



బొడ్మట్‌పల్లి వద్ద వృథాగా పారుతున్న మిషన్ భగీరథ నీరు

టేక్మాల్(మెదక్): అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. మిషన్ భగీరథ పైపు లీకేజీతో కలుషిత నీరు సరఫరా అవుతోంది, ఈ నీటిని తాగలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పుష్కలంగా తాగునీరు అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. అయితే క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపంతో భగీరథ పైపులు తరచూ లీకవుతూ నీరంతా కలుషితం అవుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లి శివారులో 161 సంగారెడ్డి–అకోలా జాతీయ రహదారి పక్కన ఉన్న మిషన్ భగీరథ పైపు రెండు నెలల క్రితం పగిలింది. పైపు లీకేజీతో నీరంతా వృథాగా పోతోంది. స్థానికులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు వస్తున్నారు, చూస్తున్నారు, పోతున్నారే తప్ప చర్యలు చేపట్టలేదు. దీంతో ఈ నీరంతా చేల గుండా పారుతూ ఇతర గ్రామాల్లోకి చేరింది. కలుషితమైన సరఫరా అవుతుండటంతో ప్రజలు ఆ నీటిని తాగలేకపోతున్నారు. కలుషిత నీటిని సరఫరా చేస్తూ తమను అనారోగ్యానికి గురిచేస్తారా? అని ప్రశ్నిస్తున్నారు. ఇక లీకేజీ పైపును పరిశీలించడానికి వచ్చిన అధికారులు అక్కడ గుంత తీయించి వెళ్లారు. ఆ గుంతలో ఎవరైన పడే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. నీరు పారే పొలాల్లో దుక్కిదున్నే పనులు చేపట్టలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు సమస్య గురించి వివరించినా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజాప్రతినిధులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలం పర్వతాపూర్ వద్ద బుధవారం కారు బోల్తా కొట్టిన సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. గొట్టంగోట నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్న కారు పర్వతాపూర్ శివారులో అదుపుతప్పి బోల్తాకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న మహావీర్, సునీల్, అజయ్‌లకు గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. జహీరాబాద్ రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతు సంఘం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న సంఘం సభ్యులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల గ్రామ రైతుసంఘం నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సంజీవరెడ్డి, ఆనంద్, మల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, కోశాధికారిగా సదానందరెడ్డిలతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. రైతుల సంక్షేమానికి తన కృషి చేస్తానని మోహన్‌రెడ్డి చెప్పారు.

అవార్డు గ్రహీతకు సత్కారం


వినయపాటిల్ దంపతులను సత్కరిస్తున్న తపస్ నాయకులు

జహీరాబాద్: రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉమెన్ ఐకాన్ అవార్డును పొందిన వినయపాటిల్‌ను తపస్ తరపున ఘనంగా సత్కరించారు. బుధవారం జహీరాబాద్‌లో తపస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వినయ పాటిల్, నాగేశ్వర్‌పాటిల్ దంపతులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తపస్ నాయకులు బస్వరాజ్, గోపాల్, దశరథ్, తుక్కప్ప, శ్రీపాల్, కృష్ణ, శివాజీ, బల్‌శెట్టి, తుకారం పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రేమించిన అమ్మాయితో పెళ్లి కాకపోవడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామచంద్రాపురం పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలోని శ్రీ సాయినగర్ కాలనీకి చెందిన హేమచంద్రకుమార్(25)ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గత కొంత కాలంగా అతను ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు అమ్మాయి తల్లిదండ్రులతో మాట్లాడారు. పెళ్లికి అమ్మాయి కుటుంబ సభ్యులు నిరాకరించడంతో హేమచంద్రకుమార్ మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలోనే ఆయన మంగళవారం రాత్రి డ్యూటీకి వెళ్లి వచ్చాడు. బుధవారం తన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీన్ని గమనించిన మృతుని కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవరే సూత్రధారి..!

- దారి దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు
- 11మంది నిందితుల అరెస్ట్
- సీసీ ఫుటేజీల ఆధారంగానే గుర్తింపు
- రూ.6,70,000లు, నాలుగు బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సైదులు


రేగోడ్(మెదక్): నిందితుల వివరాలు వెల్లడిస్తున్న మెదక్ డీఎస్పీసైదులు

రేగోడ్(మెదక్): దారి దోపిడీ కేసును పోలీసులు చాలెంజ్‌గా తీసుకున్నారు. దోపిడీ జరిగిన రెండు రోజుల్లోపే నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి డీసీఎం వ్యాన్ డ్రైవర్ కావడం గమనార్హం. అల్లాదుర్గం సీఐ జార్జి, ఏఎస్‌ఐ మల్లయ్యతో కలిసి మెదక్ డీఎస్పీ సైదులు స్థానిక పోలీస్‌స్టేషన్లో బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు.

రెండు నెలల క్రితమే పథక రచన

జహీరాబాద్‌లోని ఆనంద్ కిరాణ దుకాణంలో ఐటీసీ ప్రొడక్ట్ డిస్ట్రిబ్యూటర్‌గా డీసీఎం వ్యాన్ డ్రైవర్ మహమ్మద్ అహ్మద్ పని చేస్తున్నాడు. పనిలో భాగంగా ప్రతీ సోమవారం పెద్దశంకరంపేట, వట్‌పల్లి, అల్లాదుర్గంలోని కిరాణ దుకాణాల్లో ఐటీసీ ప్రొడక్ట్‌ను సరఫరా చేస్తుంటాడు. ఈ క్రమంలోనే జీతం డబ్బులు కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో తాను సరఫరా చేసినంతరం సామగ్రిపై వచ్చే డబ్బును కాజేయాలనుకున్నాడు. కలెక్షన్ డబ్బును ఎలాగైనా దోచుకోవాలని స్నేహితుడైన మహమ్మద్ అన్వర్‌ను తోడు చేసుకున్నాడు. వీరితో పాటు మరో 9 మంది యువకులను వారు కలుపుకున్నారు.

పథకం ప్రకారమే దాడి

మెదక్ జిల్లా రేగోడ్ మండలంలోని తాటిపల్లి మిషన్ భగీరథ ట్యాంకుల వద్ద ఈనెల 20న సాయంత్రం 5గంటల 30 నిమిషాలు..జహీరాబాద్‌కు చెందిన డీసీఎం వాహనంలో డ్రైవర్‌తో పాటు మరో ఐదుగురు ఐటీసీ సామగ్రి సరఫరా చేయగా వచ్చిన డబ్బులతో వెళ్తున్నారు. ముందుగానే వేసుకున్న పథకం ప్రకారం జహీరాబాద్‌కు చెందిన 6గురు రెండు బైక్‌లపై వచ్చి అడ్డుకున్నారు. వ్యాన్‌లో ఉన్న వారిపై కళ్లల్లో కారం చల్లి, కత్తి, కర్రలతో దాడి చేసి రూ.7,46,411లను ఎత్తుకెళ్లారు.

యువకులను పంపించింది అన్వర్

కారంపొడి ఎవరు చల్లాలి, క్యాష్ బ్యాగ్ ఎవరు గుంజుకోవాలని డ్రైవర్ మహమ్మద్ అహమ్మద్, అన్వర్లు వేసుకున్న పథకం ప్రకారమే 9మంది యువకులను కలుపుకొని దోపిడీకి పాల్పడ్డారు.

సీసీ పుటేజీల ఆధారంగా గుర్తింపు

తాటిపల్లి దారి దోపిడీ కేసులో నిందితులను సీసీ పుటేజీల ద్వారా గుర్తించినట్టు మెదక్ డీఎస్పీ సైదులు తెలిపారు. డ్రైవర్‌తో పాటు మరో పది మంది యువకులను అరెస్ట్ చేసి.. వారి వద్దనుంచి రూ.6,70,000లు, ఒక కత్తి, రెండు కర్రలు, కారం పొడి, నాలుగు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఎస్పీ ఆదేశాల ప్రకారమే రెండు బృందాలుగా విడిపోయి నింధితులను గాలించి పట్టుకున్నామన్నారు. అల్లాదుర్గం సీఐ జార్జి, పెద్దశంకరంపేట ఎస్ఐ బాల్‌రాజ్, రేగోడ్ పోలీసులను డీఎస్పీ అభినందించారు.

నిందితులు వీరే

మహమ్మద్ అహ్మద్, మహమ్మద్ అన్వర్, మిర్జా ఖాసిఫ్, మహమ్మద్ సయిఫ్ ఖాన్, సుఫాన్, ఎండీ బుర్హాన్, ఎండీ మంజూర్, మహమ్మద్ సమీర్, మహమ్మద్ హర్షద్, మహమ్మద్ మస్తాన్, ఎండీ హర్షద్‌లను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు.

మాట కలిపి దోచేస్తున్నారు..



సిద్దిపేటకమాన్: పార్ట్ టైం జాబ్ ఉందంటూ గుర్తు తెలియని వ్యక్తి మాట..మాట కలిపి బాధితుడి ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.2.61లక్షలు కాజేసిన సంఘటన సిద్దిపేట పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సిద్దిపేట పట్టణంలోని ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌కు పార్ట్ టైం జాబ్ ఉందనే మెసేజ్ వచ్చింది. వెంటనే సదరు వ్యక్తి ఆ నెంబర్‌కు ఫోన్ చేశాడు. ఫోన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మాటా..మాటా కలిపాడు. పార్ట్‌టైం జాబ్‌కు కొంత డబ్బులు చెల్లించాలని, వివరాలను నమోదు చేసి టెలిగ్రామ్ గ్రూప్‌లో జాయిన్ అవ్వమని ఓ లింకును పంపాడు. అది నమ్మిన బాధితుడు ఆ లింకును ఓపెన్ చేయగానే అతడి ఖాతా నుంచి రూ.2,61,224 డెబిట్ అయినట్టు తెలుసుకున్నాడు. చేసేదేమి లేక బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

మరోఘటనలో

సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఆటోడ్రైవర్‌కు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ఓ ఫ్లెవుడ్ షాప్‌లో కొన్ని వస్తువులు ఆర్డర్ చేశామని తాము సూచించిన అడ్రస్‌లో డెలివరీ చేయాలని తెలిపాడు. ఆటో కిరాయి డబ్బులు చెల్లిస్తామని ఓ క్యూర్ కోడ్‌ను బాధితుడి ఫోన్‌కు పంపి స్కాన్ చేయాలని సూచించారు. అది నమ్మిన ఆటోడ్రైవర్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగా ఆటోడ్రైవర్ ఖాతా నుంచి రూ.36,799 డెబిట్ అయ్యాయి. వెంటనే బాధితుడు సైబర్ నేరం జరిగినట్లు గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. సైబర్ నేరగాళ్లు, సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

వీధి కుక్కలతో తప్పని ఇబ్బందులు


గాయపడిన మసీహుద్దీన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్‌లలో వీధి కుక్కలతో ఇబ్బందులు తప్పడంలేదు. గత కొద్ది రోజుల క్రితం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో ఓ విద్యార్థిపై వీధి కుక్కలు దాడి చేసిన సంఘటన అందరికీ తెలిసిందే. తాజాగా భారతినగర్ డివిజన్ పరిధిలోని పాత ఎంఐజీ కాలనీలో వీధి కుక్కల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అవి వాహనదారుల వెంట పడటంతో వారు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులపై వెంట పడి దాడి చేస్తున్నాయి. దీంతో వారు అదుపు తప్పి ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. వీటి కారణంగా నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం జరుగుతూనే ఉన్నాయి. వీధి కుక్కలను నియంత్రించడంలో సంబంధిత అధికారులు విఫలం చెందుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత ఎంఐజీ కాలనీకి చెందిన చిరు వ్యాపారి మసీహుద్దీన్ తన వాహనంపై వెళ్తుండగా వీధి కుక్కల కారణంగా అదుపు తప్పి వాహనంపై నుంచి పడి గాయాలపాలయ్యాడు. ఈ సంఘటనలను దృష్టిలో ఉంచుకొని అధికారులు ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు బారికేడ్లు



ఏఐజీ ఆస్పత్రి యాజమాన్యం అందజేసిన బారికేడ్లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు ప్రమాదాలను నివారించేందు ఏఐజీ ఆస్పత్రి యాజమాన్యం 24 బారికేడ్లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌గారి రమణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కొందరు స్థానికులు తమ దృష్టికి తెచ్చారన్నారు. గత కొద్ది రోజులుగా తెల్లాపూర్ రేడియల్ రోడ్డుపై జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని తాము 24 బారికేడ్లను అందజేశామన్నారు.

అనుమానాస్పద స్థితిలో చిన్నారి మృతి


చిన్నారి అశ్విని

కోహీర్(జహీరాబాద్): అనుమానాస్పద స్థితిలో చిన్నారి మృతి చెందిన సంఘటన మాచిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై సురేశ్ వివరాల ప్రకారం...మాచిరెడ్డిపల్లిలో ఉంటున్నా వెంకట్‌రెడ్డి మేస్త్రీ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. వెంకట్‌రెడ్డికి 2015లో పైడిగుమ్మల్‌కు చెందిన భాగ్యలక్ష్మితో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. మంగళవారం రాత్రి భాగ్యలక్ష్మికి అత్త వనజమ్మకు మధ్య గొడవ జరిగింది. ఈ విషయంపై ఉదయం భాగ్యలక్ష్మి సర్పంచ్‌కు ఫిర్యాదు చేసింది. ఆమె ఇంటికి తిరిగొచ్చేసరికి మూడో సంతానం అశ్విని(15 నెలలు)చనిపోయి విగత జీవిగా పడుకొని ఉంది. అశ్విని మృతికి నువ్వే కారణమని అత్తకోడళ్లిద్దరు ఒకరిపై మరొకరు నిందలు వేస్తూ గొడవకు దిగారు. తండ్రి వెంకట్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సురేశ్ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వట్‌పల్లి(అందోల్): అల్లాదుర్గ మెటల్‌కుంటా రహదారి బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన వట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రహదారి పక్కనే దట్టమైన పొదల్లో ఓ చెట్టుకు వేలాడుతున్నా మృతదేహం కనిపించడంతో అటువైపుగా వెళ్లిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందికి దించి పరిశీలించారు. మృతదేహం మీద ఉన్న బట్టలను చూసినప్పటికీ ఎటువంటి ఆచూకీ లభించలేదు. మృతి చెందిన వ్యక్తి ఈ పరిసర గ్రామాలకు చెందిన వ్యక్తి కాదని ఎక్కడైనా హత్య చేసి ఇక్కడ చెట్టు కొమ్మకు కట్టారా? లేదా తను ఆత్మహత్య చేసుకున్నాడా? అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు. మృతుని వయస్సు సుమారు(65) సంవత్సరాలు ఉండోచ్చని పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

బెజ్జంకి(సిద్దిపేట): ముత్తన్నపేట శివారులో పేకాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.14,780లను సీజ్ చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌రాజ్ బుధవారం పేర్కొన్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూలీలు మృతి

- అతివేగంగా ఢీ కొట్టిన బొలెరో వాహనం
- అక్కడికక్కడే ఒకరు, మార్గమధ్యలో మరొకరు


విజయ్ (ఫైల్)


రఘు (ఫైల్)

సిద్దిపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువ కూలీలు మృతి చెందిన ఘటన ఇర్కోడ్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దుబ్బాక మండలం చేర్వాపూర్ గ్రామానికి చెందిన చిట్టపాక విజయ్(23), బదనకంటి రఘు(25)లు రోజువారిగా కూలీ నిమిత్తం ఉదయం సిద్దిపేటకు వచ్చారు. పనులు ముగించుకుని సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్లేక్రమంలో ఇర్కోడ్ వద్ద దుబ్బాక నుంచి సిద్దిపేట వైపు వస్తున్న బొలెరో గూడ్స్ వాహనం విజయ్, రఘులు వెళ్తున్న బైక్‌ను ఢీ కొంది. ఈ ఘటనలో విజయ్ తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలపాలైన రఘును సిద్దిపేట ఆస్పత్రికి తరలించే క్రమంలో అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి విజయ్ తండ్రి కనకయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ కిరణ్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...


సింగోజి ఆంజనేయులు

కొండపాక(గజ్వేల్): రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన సింగోజి ఆంజనేయులు(60) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు కుకునూరుపల్లి ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి...తిమ్మారెడ్డిపల్లికి చెందిన సింగోజి ఆంజనేయులు వృత్తి రీత్యా కార్పెంటర్ పని చేస్తున్నాడు. మంగళవారం పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లొచ్చే క్రమంలో తిమ్మారెడ్డిపల్లి, కొమురవెల్లి కమాన్ వద్ద ఆర్టీసీ బస్సు దిగాడు. కాలినడక ఇంటికి వెళ్తున్నక్రమంలో సిద్దిపేట వైపునకు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఆంజనేయులును ఢీ కొట్టింది. తీవ్ర గాయాలపాలైన అతన్ని స్థానికులు లక్ష్మక్కపల్లి శివారులోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. మృతుని కుమారుడు సింగోజి భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


చెక్కు అందజేస్తున్న సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం గోమారం గ్రామంలో అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు హన్మంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అశోక్‌రెడ్డి, లాయక్, మహిపాల్‌రెడ్డి, శ్రీశైలం, లక్ష్మన్‌గౌడ్, నర్సింహరెడ్డి ఉన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమాలు చేయాలి

కొండాపూర్(సంగారెడ్డి): విద్యార్థులు తమ హక్కులను సాధించుకోవడానికి భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమాలు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాల సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయం నుంచి ఐబీ వరకు 2కే రన్ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాణిక్యం మాట్లాడుతూ.. భగత్‌సింగ్ చేసిన త్యాగం మరువలేనిదని, 23 ఏళ్లకే స్వాతంత్ర్యం కోసం ఉరికొయ్యను ముద్దాడిన యువ కెరటం అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టడానికి ఉద్యమాలు చేయక తప్పదన్నారు. ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రమేశ్, ఉపాధ్యక్షుడు ఎర్రోళ్ల మహేశ్, సతీశ్, శీను, ప్రవీణ్‌కుమార్, శివ, సచిన్, కృష్ణ, పాల్గొన్నారు.

పోషకాహార ప్రాధాన్యంపై అవగాహన


మాట్లాడుతున్న అంగన్‌వాడీ టీచర్

రాయికోడ్(అందోల్): మండలంలోని ఇటికేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, తల్లులకు, స్థానికులకు అంగన్‌వాడీ టీచర్ పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. వివిధ రకాల పోషకాలు అందించే కూరగాయలు, పండ్లు, ఇతర ఆహార పదార్థాలను ప్రదర్శనకు ఉంచారు. ఏ ఆహారం పదార్థాల్లో ఎలాంటి పోషకాలు ఉంటాయో వివరించారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను వివరించారు. పౌష్టికాహార లోపంతో తలెత్తే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వితమ్మ, బీఆర్ఎస్ నాయకులు కిష్టారెడ్డి, అంగన్‌వాడీ టీచర్, సిబ్బంది, గ్రామస్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

వైభవంగా నాచగిరిలో పూజలు


నాచగిరిలో పంచాంగం వింటున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, తదితరులు

వర్గల్(గజ్వేల్): నూతన సంవత్సరాది శోభకృత్ నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ నాచగిరిలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకలకు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనను వేదపండితులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆలయ ఆస్థాన పురోహితుడు గోపాలకృష్ణ శర్మ పంచాంగాన్ని వినిపించారు. ఈ వేడుకలలో నాయకులు, పురప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పంచాంగ శ్రవణం విన్నారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని స్వీకరించారు. స్వామివారిని దర్శించుకొని ఆశీస్సులు పొందారు.

పార్టీకి మీరే బలం... బలగం

- వారధుల్లా పనిచేస్తున్నారు
- మీ భాగస్వామ్యం ఎప్పటికీ మరువం
- త్వరలో పల్లెపల్లెల్లో ఆత్మీయ సమ్మేళనం
- రాష్ట్ర, ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు


టెలీ కాన్ఫరెన్స్‌లో మంత్రి హరీశ్ రావు

సిద్దిపేటజోన్: బీఆర్ఎస్ క్యాడర్‌కు ఉగాది శుభాకాంక్షలు....ఉగాది పచ్చడి లెక్క మీ జీవితం షడ్రుచుల సంగమంలా ఉండాలి. అందరికీ శుభం కలగాలి. బీఆర్ఎస్‌కి మీరే బలం... బలగం అని రాష్ట్ర, ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. బుధవారం రాత్రి నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు వారి సంప్రదాయాలకు ప్రతిరూపం ఉగాది అని, ఏడాది అంతా మనకు మంచి జరగాలని ఆకాంక్షించారు. సిద్దిపేట నాడు తెలంగాణ ఉద్యమంలో నేడు రాష్ట్ర ప్రగతిలో అగ్ర స్థానంలో ఉందన్నారు. ఇది మీ అందరి భాగస్వామ్యంతోనే సాధ్యమైందని పేర్కొన్నారు. మీ సహకారం, భాగస్వామ్యం ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. స్వ రాష్ట్రంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య మీరు వారధి లెక్క పనిచేశారని అభినందించారు. త్వరలో తేదీల వారిగా గ్రామాల్లో షెడ్యూల్ చేసుకొని ఆత్మీయ సమావేశాలు అద్భుతంగా నిర్వహించుకుందామని పేర్కొన్నారు. ప్రభుత్వం సాధించిన విజయాలు, పథకాలు, సంక్షేమం గూర్చి ప్రజలకు వివరించి, నాటి, నేటి పరిస్థితులను ప్రజలకు వివరించి చైతన్యవంతులను చేయాలని సూచించారు. కరువు నియోజకవర్గంగా ఉండే సిద్దిపేట నేడు అద్భుతమైన ప్రగతి సాధించిన విషయాన్ని పల్లెపల్లెల్లో చెప్పాలన్నారు. సిద్దిపేటకు రైలు, గోదారి జలాలు, సిద్దిపేట జిల్లా అనే ట్యాగ్ లైన్ ఉండేదని అది సాధ్యం చేసుకున్నామన్నారు. జిల్లా సాధించి, గోదారి నీటితో బీడు భూముల్లో సాగు చేస్తూ, త్వరలో రైలు కూడా రానుందన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జెడ్పీ చైర్మన్ రోజాశర్మ, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్స్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.